10న జిల్లాకు చంద్రబాబు రాక



ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మార్చి 10వ తేదీన జిల్లాకు రానున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో నిర్వహించనున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కారక్రమంలో పాల్గొనున్నారు. రోడ్‌షోతో పాటు నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఈ నెల మూడో తేదీన ఒక టీం వస్తుందని, జిల్లా నేతలతో చర్చించిన తర్వాత పర్యటన పూర్తి స్థాయి షెడ్యూల్ ఉంటుందని పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ తెలిపారు.

మోడీని గద్దె దించితేనే పేదలకు న్యాయం

- ప్రజలు ఐక్యంగా పోరాడకుండా మతం పేరుతో చిచ్చు
- కేరళ తరహా క్యాష్యూ కార్పొరేషన్ కోసం కలిసికట్టుగా పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

బహిరంగ సభలో మాట్లాడుతున్న తులసీదాస్

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పేదలకు ఇస్తున్న సబ్సిడీలకు కోత పెట్టి అదానీ, అంబాని వంటి కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్న బిజెపి సర్కార్‌ను దించితేనే పేదలకు న్యాయం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రభార భేరి ముగింపు సందర్భంగా శనివారం పలాసలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజావ్యతిరేక, నిరంకుశ బిజెపిని సాగనంపుదాం రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీని గద్దె దించండి... అని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బి.తులసీదాస్, సిపిఐ రాష్ట్ర నాయకులు చాపర సుందరలాల్ మాట్లాడుతూ బిజెపి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చును రాజేస్తోందని, మరోవైపు ఆదానీ, అంబాని లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచి పెడుతోందని, ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచి వేస్తోందని అన్నారు. నాడు అనేక మంది త్యాగధనులు, బ్రిటీష్ వలస పాలనను ఎదిరించి, తరిమికొట్టి మనకి స్వాతంత్రం తెచ్చారని, నేడు అదే స్వాతంత్రం పెను ప్రమాదంలో పడిందన్నారు. ఆ నాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. మనందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకుల్ని, మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ పరిశ్రమలను, విశాఖ ఉక్కు, ఓడ రేవుల్ని, ఆఖరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు దారాదత్తం చేస్తోందన్నారు. మోడీ అండదండలతో ఆదాని ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిడెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని, దాని మీద విచారణకు అంగీకరించకుండా ఆదానిని ఈ కేంద్ర ప్రభుత్వం వెనకేసుకొస్తోందని చెప్పారు. పైగా మరింత వేగంగా దేశంలోనే అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతోందని అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ పేదలకు, సామాన్య ప్రజలకు అండగా ఉండడం పోయి, వారి మీదే మోయలేనంత భారాలు మోపుతోందని, మోడీ ప్రభుత్వం గ్యాస్ బండ మనకు గుదిబండ అయిపోయిందని, కరెంట్ బిల్లులు ముట్టుకుంటేనే షాకులు కొడుతున్నాయని, పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు మన బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయని అన్నారు. ధరల కొండెక్కాయ్ నిరుద్యోగులు బతుకులు అగాధంలోకి జారిపోతున్నాయని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పేదలకు విద్య, వైద్యం అందనంత ఖరీదైపోయి కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయిందని చెప్పారు. గ్రామీణ పేదలకు ప్రాణాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటుకెక్కించిందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ మాట్లాడుతూ ఐటిడిఎను నిర్మించాలని, వంశధార నిర్వాశితులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పరిహారం చెల్లించాలని, జీడి పంటకు మద్దతుధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ప్రజల భూములను ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకవిధానాలను విడనాడాలని, లేకుంటే పోరాటాలను తీవ్ర తరం చేస్తామని ఆయన హెచ్చరించారు. పలాస మండల నాయకులు యన్. గణపతి ఆహ్వానిచారు. కార్యక్రమంలో ఎస్.లక్ష్మీనారాయణ, ఆర్.దిలీప్‌కుమార్, దుబ్బ భానుమతి, లండ వెంకటరావు, పి.సాంబమూర్తి, చాపర వేణు, టి.భాస్కరరావు, దేవేంద్ర, డి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కల నెరవేర్చాం

- మంత్రులు ఆదిమూలపు సురేష్, ధర్మాన వెల్లడి
- 1280 టిడ్కో ఇళ్లు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పట్టణ పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌దేనని రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానంలో ఉందని మంత్రులు చెప్పారు. శ్రీకాకుళం మండలం పాతృనివలసలో నిర్మించిన 1280 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ 40 బ్లాకులతో మొత్తం 1280 ప్లాట్లకు రూ.105.62 కోట్ల మేర నిధులు ఖర్చు చేసినట్టు తెలిపారు. టిడ్కో గృహ సముదాయం వద్ద రోడ్లు, కాలువలతో పాటు, 5లక్షల లీటర్ల కెపాసిటీ గల నీళ్ల ట్యాంకు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, జిల్లాకు అందుబాటులో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంటుందన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ పాత్రునివలస, పొన్నాడ, తదితర గ్రామాల్లో మరో 12వేల ఇళ్ల నిర్మాణం పట్టణ పేదలకోసం జరుగుతోందన్నారు. నిష్పక్షపాతంగా లాటరీ పద్ధతిలో ఇళ్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసాద్ మాట్లాడుతూ టిడ్కో గహాలు 24 పట్టణాల్లో పూర్తి చేశామని, ఇప్పటివరకు 50వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపి టిడ్కో ఎమ్‌డి చిత్తూరు శ్రీధర్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, నగర పాలక సంస్థ కమిషనరు చల్లా ఒబులేష్, కాపు కార్పొరేషన్ అధ్యక్షులు ఎం.శ్రీకాంత్, కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మాజీ సర్పంచ్ గాంధీ, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మాజీ సర్పంచ్ గాంధీ, పైడిశెట్టి జయంతి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఇంటి తాళం అందిస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, ధర్మాన ప్రసాదరావు

ధర్నా నిర్వహిస్తున్న ఎపి జెఎసి నాయకులు

మానస పుత్రిక అంటూనే వెట్టిచాకిరీ

- సచివాలయ ఉద్యోగులపై నిర్లక్ష్యం తగదు
- ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్ దామోదరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ మానసపుత్రిక అంటూ ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులపై అనుసరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరి అవలంబిస్తున్నారని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఆర్టీసి ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద జెఎసి ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగం సంపాధించిన ఉద్యోగులకు 9నెలలు, రెండో దశలో చేరిన వారికి ఐదు నెలలు ప్రభుత్వం బకాయిలు నేటికీ చెల్లించలేదని తెలిపారు. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించి సాధారణ బదిలీలు చేపట్టి, బదిలీల్లో స్పౌజ్‌కు అధిక ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని కోరారు. రూరల్, అర్బన్ ఏరియా ప్రాతిపదికన ఉద్యోగుల సీనియార్టీని పరిగణలోనికి తీసుకుని న్యాయం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను వెంటనే తయారు చేయాలన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌ను డిస్కంతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విలీనమైన ఆర్టీసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గురుకులాలు, యూనివర్శిటీ ఉద్యోగులకు రిటైర్‌మెంటు 62ఏళ్లకు పెంచాలని, తదితర డిమాండ్లపై ప్రభుత్వం నుండి స్పష్టమైన, లిఖితపూర్వక హామీ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణలో మూడోదశకు వెళ్తామని హెచ్చరించారు.

ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కంచరాన శ్రీరాములు, జనరల్ సెక్రటరీ సీపాన వెంకటరమణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు జాబ్ చార్ట్ ఏర్పాటు చేసి, ఎపిజిఎల్ఐ బాండ్లను, ఈహెచ్ఎస్ కార్డులను వెంటనే అందజేయాలని కోరారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపాన గోవిందరావు, ఆర్టీసీ ఇయు జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు జి.త్రినాథ్, కార్యదర్శి కె.దశరథుడు, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ నకిలీ సర్టిఫికేట్‌పై కోర్టుకు వెళ్తా

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

(6లో)

జెఇఇలో మెరిసిన సిక్కోలు విద్యార్థులు

ఒబిసి కేటగిరీలో 39, 124 ర్యాంకులు కైవసం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

జెఇఇ మెయిన్స్‌లో సిక్కోలు విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీల్లో మంచి ర్యాంకులు సాధించారు. ఒబిసి కేటగిరిలో జాతీయ స్థాయిలో 39, 124 ర్యాంకులు, ఎస్‌సి కేటగిరిలో 14, 268 ర్యాంకులు సాధించారు. ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన మెండ వెంకట హర్షవర్ధన్‌కు ఒబిసి కేటగిరిలో జాతీయ స్థాయిలో 39వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 211వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా శ్రీకాకుళం నగరం బొందిలీపురానికి చెందిన హనుమంతు నితిన్‌కు ఒబిసి కేటగిరిలో 124వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 743వ ర్యాంకు వచ్చింది. ఎస్‌సి కేటగిరిలోనూ పలువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. యానాది భరత్‌కు ఎస్‌సి కేటగిరిలో 14వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 1110 ర్యాంకు వచ్చింది. శ్రీకాకుళం నగరానికి చెందిన రాకోటి వెంకటసాయి హర్షవర్ధన్‌కు ఎస్‌సి కేటగిరిలో 268వ ర్యాంకు, ఓపెన్ కేటగిరిలో 11836వ ర్యాంకు వచ్చింది.



రోహిత్ (3001 ర్యాంకు) సంప్రీత్ (3986) గణపతి

శ్రీకాకుళం నగరానికి చెందిన సుంకర రోహిత్ జాతీయ స్థాయిలో 3001వ ర్యాంకు సాదించాడు. నగరంలోని శ్రీచైతన్య ఐఐటి క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ చదువుకున్న రోహిత్ తండ్రి ఎస్‌విరమణమూర్తి కోపరేటివ్ సొసైటీలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తల్లి మంజుల టీచర్. రోహిత్ ఐఐటిలో సీటు సాధించడమే లక్ష్యమని తెలిపాడు.

కత్తెర వీధికి చెందిన వడ్డాది సంప్రీత్ జాతీయ స్థాయిలో 3,986వ ర్యాంకు సాధించాడు. సంప్రీత్ తండ్రి వడ్డాది శ్రీనివాసరావు కారణా వ్యాపారి, తల్లి రాజ్యలక్ష్మి గృహిణి. పదో తరగతి వరకు నగరంలోని శ్రీచైతన్య టెక్నోలో చదువుకున్నాడు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవుకున్న సంప్రీత్ హైదరాబాద్ ఐఐటిలో సిఎస్ఇలో సీటు సాధించాలని ఆకాంక్షిస్తున్నాడు.

నగరంలోని ద్వారకానగర్‌లో నివాస ముంటున్న గడగమ్మ మణికంఠ సాయి గణపతి జెఇఇ మెయిన్స్‌లో 98.40శాతం మార్కులు సాధించాడు. ఈయన తండ్రి శ్రీనివాసరావు మెడికల్ రిప్, తల్లి మృణాళిని గృహిణి. ఐఐటిలో సీటు సాధించడమే లక్ష్యమని తెలిపాడు.

దేవీ ప్రసాద్(2468) ప్రేమ్‌కుమార్ (2571) సంతోష్ భార్గవ్ (4558)

పలాస: ఇచ్ఛాపురానికి చెందిన పితాంబర రెడ్డి కుమారుడు సిగ్గ ప్రేమ్‌కుమార్ ఆల్ ఇండియా స్థాయిలో 2571, రాష్ట్రంలో (ఒబిసి) 467 సాధించాడు. పలాసకు చెందిన గుంట తేజేశ్వరరావు కుమారుడు గుంట సంతోష్ భార్గవ్ ఆల్ ఇండియాలో 4,558(913), పలాసకు చెందిన శాసనపురి రవి కుమార్ కుమారుడు అఖిల్ ఆల్ ఇండియా స్థాయిలో 6157 (801), యతిరాజుల రవికుమార్ కుమారుడు సాయి సాంకేతిక ఆల్ ఇండియా స్థాయిలో 14,185 (3312) ర్యాంకులు సాధించారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం కాశీపురానికి చెందిన లింగూడు దేవీప్రసాద్ ఉత్తమ ర్యాంకు సాధించారు. దేవీప్రసాద్ ఆల్ ఇండియా 10,995 ర్యాంకు సాధించారు. ఒబిసి కేటగిరిలో 2468 ర్యాంకు సాధించారు. ఈయన తండ్రి అప్పలస్వామి రైతు. తల్లి కుమారి గృహిణి. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గ్రామస్తులు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

గరిష్ట కూలి వచ్చేలా చూడాలి

- పురోగతి లేని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు కూలి పెంచాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. ప్రస్తుతం రూ.234లుగా ఉన్న కూలిని రూ.272లుగా ఉండాలని ఆకాక్షించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ, అమృత్, మొక్కల పెంపకం, తదితర అంశాలపై ఎపిఒ, ఎసి, ఎఫ్‌పిఒలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూలి పెంపులో పురోగతి ఉండాలని పలుమార్లు ఆదేశించినప్పటికీ నిర్లిప్తత కనబర్చిన ఎల్ఎన్‌పేట, వి.కొత్తూరు, సరుబుజ్జిలి మండలాల ఎపిఒ, ఎసిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. లేకుంటే వెనుకంజలో ఉన్న మండలాలతో సమీక్షిస్తామని, అప్పటికీ ప్రగతిని కనబరచకపోతే విధుల నుండి తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

జిల్లాలో గరిష్ట కూలి రూ.189లు కాగా, సగటు కూలి రూ.234లుగా ఉందన్నారు. రూ.272ల వరకు చెల్లించే అవకాశం ఉన్నందున, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. రానున్న రెండు మాసాలు ఉపాధి పనులకు అత్యంత కీలకమైనందున వీలైనన్ని పనులు చేపట్టాలని అన్నారు. చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. పని దినాల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఎపిఒలు క్షేత్రస్థాయిలో సందర్శించి కూలి పెంచేలా చర్యలు తీసుకొని, జిల్లా ప్రగతిని కనబరచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పాలకులకు పట్టని కార్మికుల వ్యథ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలిస్తామంటూ ఓ వైపు చెప్తున్న ప్రభుత్వం దాని అమలు విషయం పక్కన పెడితే వారిని ఉన్న ఉద్యోగాల నుంచి పరిశ్రమల యాజమాన్యాలు తీసేస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదు. రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరేజిస్ లిమిటెడ్ కంపెనీ కొందరిని తొలగించి, మరికొందరికి పని దినాలు తగ్గించే చర్యలు పాల్పడుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019, సెప్టెంబర్‌లో మొదలు పెట్టిన తొలగింపులు, పని దినాలు తగ్గింపు ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉంది. ప్రభుత్వం నుంచి మద్యం కొనుగోళ్లు తగ్గాయనే పేరుతో ఈ రకమైన నిర్ణయాలను అమలు చేస్తోంది. కార్మికుల పోరాటం తర్వాత ప్రభుత్వం కొంతమేర కొనుగోళ్లను పెంచినా యాజమాన్యం పాతపద్ధతినే అనుసరిస్తోంది. 15రోజుల కిందటి వరకు కనీసం 13 రోజులైనా పని కల్పించారు. ఆ తర్వాత నుంచి పూర్తిగా ఆపేశారు కడుపు మండిన కార్మికులు ఈ నెల 27 నుంచి కుటుంబాలతో ఫ్యాక్టరీ ముట్టడిని చేపట్టాయి. సమస్య సృష్టించిందే యాజమాన్యం కాబట్టి ప్రభుత్వం, అధికారులే స్పందించాల్సి ఉన్నా అటువైపు ఏ రకమైన స్పందన కనిపించడం లేదు. కార్మిక సంక్షేమమంటూ ప్రకటనలు గుప్పించే ప్రభుత్వానికి మండుటెండలో పిల్లాపాపలతో ఆందోళన చేస్తున్న కార్మిక కుటుంబాల వ్యథ ప్రభుత్వానికి కనిపించడం లేదు. విశాఖకు రాజధాని వస్తే యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, ఇంకా ఎన్నాళ్లు జిల్లా నుంచి వలసపోవాలని బహిరంగ సభల్లో ఆవేదన వ్యక్తం చేసే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పనులు లేక ఆర్ధిక ఇబ్బందులు పడుతున్న యుబి కార్మికుల ఆకలి కేకలు వినిపించినట్లు లేదు. పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పలాస నియోజకవర్గం తప్ప మరే ఇతర సమస్యలు పట్టడం లేదు. తప నియోజకవర్గంలోని కార్మికులు పనుల్లేక పస్తులతో కాలం గడుపుతుంటే ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. టిడిపి పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. గతంలో కార్మికశాఖ మంత్రిత్వశాఖను వెలగబెట్టిన అచ్చెన్నాయుడుకూ కార్మికుల ఇబ్బందులు కనిపించలేదు. నియోజకవర్గ నాయకులకు అదో సమస్యగా కనిపించడం లేదు. యుబి కార్మికుల సమస్యలపై తొలి నుంచి పోరాడుతున్న సిఐటియు కార్మికుల పక్షాన నిలిచి పోరాటానికి అడుగడుగునా అండగా నిలుస్తోంది. వచ్చే నెల ఒకటో తేదీన కార్మికులు జరుపుకునే మేడే సంబరాల్లో కార్మిక సంక్షేమంపై ప్రసంగాల్లో ఊదరగొట్టే ఇరు పార్టీల నాయకులకు మాత్రం కార్మికుల ఇబ్బందులు పట్టడం లేదు. నిరంతరం తమకు అండగా నిలబడుతుందెవరో, మే డే రోజున మాత్రమే గుర్తుకు వచ్చేదెవరో కార్మికులు గమనిస్తూనే ఉన్నారు. కార్మికులు ప్రధానంగా దేని కోసం పోరాడారో అదే జిల్లాలో అమలు కావడం లేదు. పరిశ్రమల్లో కొంత వరకు ఎనిమిది గంటల పని విధానం అమలవుతున్నా షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో అది ఏ మాత్రం అమలు కావడం లేదు. జిల్లాలో కిరాణా దుకాణాలు మొదలు షాపింగ్‌మాల్స్ వరకు శ్రమ దోపిడీయే సాగుతోంది. పేరుకే ఎనిమిది గంటలు అని చెప్పినా 12గంటల పాటు పని చేయిస్తున్నారు. వేతనం మాత్రం ఎనిమిది గంటలను లెక్కించే చెల్లిస్తున్నారు. గతంలో పండగలు, ఆదివారాల్లో సెలవులు ఇచ్చినా ప్రస్తుతం అవి కూడా లేకుండా చేసేశారు. వీరి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్మికశాఖనూ టిడిపి ప్రభుత్వం కొంత నిర్వీర్యం చేస్తే వైసిపి ప్రభుత్వం ఆ శాఖకు ఉన్న అధికారాలను ఒక్కొకటిగా తొలగించేసింది. గతంలో దుకాణాలకు వెళ్లి తనిఖీలను చేసే అధికారం కార్మికశాఖ అధికారులకు ఉండేది. ప్రస్తుతం అది లేకపోవడంతో యజమానుల ఇష్టారాజ్యంగా మారింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పని చేయించుకుని కనీసం పది వేలు కూడా ఇవ్వనిపరిస్థితి నెలకొంది. పురుషులతో పోలిస్తే షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న మహిళల ఇబ్బందులు చెప్పనెలవి కాదు. దుకాణాల్లో ఉన్నంత వరకు నిల్చోనే పని చేయాల్సి వస్తోంది, నెలసరి రోజుల్లో వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ఏళ్లు గడుస్తున్నా ఈ తరగతి కార్మికుల బతుకులు మారడం లేదు. ఇకనైనా పాలకులు వీరి కష్టాలను గుర్తించి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సమగ్రంగా అమలు చేస్తే వీరికి కొంత వరకైనా మేలు జరగుతుంది.



ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి

సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలపై గ్రామస్థాయి ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ వైద్యాధికారులను కోరారు. ఆరోగ్యశ్రీ సేవలు, పాటించాల్సిన అంశాలపై వైద్యాధికారులతో జెసి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవాలు, ఇతర అనారోగ్య సమస్యల పరిష్కారానికి ఇతర ఆస్పత్రులకు తరలి వెళ్లేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభించే సేవలు, వైద్యంపై సరైన అవగాహన లేకపోవడమే కారణమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తమ దృష్టికి వస్తే అట్టి వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి ఆస్పత్రుల్లో నిర్దేశించిన సౌకర్యాలు ఉండాలని, లేనివాటిపై చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను జెసి ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారని, తప్పక అమలు చేయాలన్నారు. లేని ఆస్పత్రులు తక్షణమే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. ప్రతి ఆస్పత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది ఉండేలా చూడాలని అన్నారు. ఆస్పత్రుల్లో ఉండే సాంకేతిక సమస్యలు పరిష్కరించుకోవాలని జెసి సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లను విధిగా వినియోగించాలని వివరించారు. జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయకర్త పి.ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులకు, సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరైనందున ఈ విషయాన్ని అందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మే 1వ తేదీ నుండి ప్రతి మిత్రా కూడా ఆస్పత్రుల్లో బెడ్ మీద ఉన్న పేషేంట్ వద్దకు వెళ్లి ఫొటోను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ప్రతి పది మంది పేషెంట్ల ఫొటోలను ప్రతి రోజూ మిత్ర అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ సమీక్షలో డిఎంఅండ్‌హెచ్ఒ బి.మీనాక్షి, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి జె.భాస్కరరావు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

RULE 64 NOTICE

IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
E.P 24/2021 IN O.S.302/2015

Between: Potnuru Anitha
--Petitioner/Decree holder
And: Potnuru Gopi
--Respondent/Judgment debtor
To: Potnuru Gopi, S/o late Narasimha Murthy, Hindu, aged 40 years, Business R/o Plot No.146, Balijepallivari veedhi, SVRS Mess back side, Srikakulam.

NOTICE

Please take notice that the above decree holder filed the above Execution petition for realisation by way of Sale of Immovable property under Rule 64 of C.P.C and the said application is posted for fixed for setting the terms of proclamation of sale. You are here by directed to appear before the above said court in person or by an Advocate duly authorized on **02-05-2023 at 10.30 A.M** to show cause against the application failing which the application will be heard and determined Exparte.

(By ORDER OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE SRIKAKULAM)

BARATAM NAGESWARA RAO
Advocate,
Srikakulam.
Cell: 9391380645

తులసీదాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి - పలాస

గిరిజన భూములను ఆక్రమించేందుకు చూస్తున్న భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిపిఐ రాష్ట్ర నాయకులు చాపర సుందర్‌లాల్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో మెళియాపుట్టి మండలం పెద్దమడికు చెందిన గిరిజనులు శనివారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ నందవ రెవెన్యూ పరిధిలో 64/2ఎ, 65/2, 68/1, 68/3ఎ సర్వే నంబరులో భూములను తరతరాలుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. మా భూములపై ఇతరులు దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమించేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గిరిజన రైతులకు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న వామపక్ష నాయకులు

బిజెపి పోతేనే దేశాభివృద్ధి

ప్రచార భేరిలో వామపక్ష నాయకులు

శ్రీకాకుళం అర్బన్ :బిజెపి పోవాలి - అభివృద్ధి కావాలి అని సిపిఎం పార్టీ నగర కన్వీనర్ టి.తిరుపతిరావు పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా 16 రోజైన శనివారం బలగ ప్రాంతం, కుమ్మరి వీధి, రిమ్స్ ఆస్పత్రిలో పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తున్నా మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు. గంగవరం, కృష్ణపట్నం వంటి కీలకమైన ఓడరేవులను, హైడ్రో విద్యుత్ ప్రాజెక్టులను, సోలార్ విద్యుత్ కోసం విలువైన భూములను, భావనపాడు భూములను స్వాధీనం చేసుకుని బడాబాబులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మోడీ ఆదేశాలకు లొంగి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి, చెత్త పన్నులను, అధిక భారాలను వేస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో మైనార్టీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, అణగారిన వర్గాల రక్షణకు ప్రజాస్వామ్య హక్కుల కోసం విశాల ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్.సురేష్‌బాబు కె.భాస్కరరావు, ఎం.రాఘవ, గోపాలం, రవణ, దమయంతి, రూప, లక్ష్మి, సత్యవతి, వేణు, అప్పారావు, సత్యం, రాజేశ్వరి పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో

- నీటి చౌర్యాన్ని అరికట్టాలి
- వేడుకుంటున్న లక్ష్ముడుపేట మహిళలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డు లక్ష్ముడుపేటలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వార్డులో 60 తాగునీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వాటి ద్వారా సక్రమంగా నీటిని అందించాల్సిన మున్సిపల్ యంత్రాంగం నిద్రమత్తులో ఉండటంతో వార్డు ప్రజలు తాగేందుకు మంచినీరు దొరక్క నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకులు తాగునీటి కుళాయిలకు మోటార్లు బిగించడంతో గత కొంతకాలంగా నీరు రావడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. తాగునీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో గగ్గోలు పెడుతూ అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను నిలదీస్తున్నారు. ఇటీవల వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు పలువురు మహిళలు కుళాయిలకు అక్రమ మోటార్లు పెడుతుండడంతో తమకు కుళాయిల ద్వారా నీరు రావడంలేదని ఫిర్యాదు చేశారు.

తాగునీరు రాక ఖాళీగా దర్శనమిస్తున్న బిందెలు

వెంటనే పురపాలక సంఘ ఎఇ కె.అప్పలనాయుడును పిలిచి కుళాయిలకు మోటార్లు పెడితే మీరు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి దగ్గర పార్టీలకతీతంగా వ్యవహరించి కేసులు పెట్టాలని ఆదేశించారు. గతంలో కొన్ని మోటార్లను స్వాధీనం చేసుకున్నామని ఎఇ స్పీకర్‌కు తెలుపగా, అక్కడే ఉన్న మహిళలు స్వాధీనం చేసుకున్న మోటార్లను అధికార పార్టీ నాయకుల సిఫార్సుతో సాయంత్రానికే మోటార్లను తిరిగి ఇచ్చేశారని, మరుసటి రోజు నుంచి యథావిధిగా కుళాయిలకు మోటార్లు పెట్టి తాగునీటిని చౌర్యం చేస్తున్నారని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. మోటార్లు పెట్టి తాగునీటిని అడ్డుకునేవారిని ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ఎఇని స్పీకర్ ఆదేశించారు. స్పీకర్ ఆదేశాలు ఎందుకు పట్టించుకోవాలని అనుకున్నారో ఏమో పెడచెవిన పెట్టి ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. వేసవికాలం కావడంతో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇంటి పన్నులు, తాగునీటి కుళాయి పన్నులు సకాలంలో చెల్లిస్తున్నా... తమకు నీటిని అందించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలు అందించాల్సిన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నీటి కుళాయిలకు మోటార్లు పెట్టి చౌర్యం చేస్తున్న వారిపై ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కుళాయి విడిచి పెట్టేటప్పుడు గ్రామానికి విద్యుత్‌ను నిలిపివేయాలని, అప్పుడైనా తమకు తాగునీరు లభిస్తుందని మహిళలు చెబుతూ వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నీటి విషయంలో కలుగజేసుకొని తమకు సక్రమంగా వేసవికాలంలో నీరు అందేటట్లు చర్యలు తీసుకోవాలని మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

స్పీకర్ నకిలీ సర్టిఫికేట్‌పై కోర్టుకు వెళ్తా

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చట్టబద్ధమైన శాసనసభ స్పీకర్ పదవిలో తమ్మినేని సీతారాం నకిలీ సర్టిఫికేట్‌తో న్యాయవిద్య చదివారని, డిగ్రీ పూర్తి చేయని ఆయనకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి ఎటువంటి ధ్రువీకరణ లేని నకిలీ సర్టిఫికేట్ ఎలా వచ్చిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రశ్నించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆమదాలవలస పట్టణం పూజారిపేట వీధిలో నివాస ముంటున్న స్పీకర్ నాగర్ కర్నూలులో పరీక్ష రాసినట్టు నకిలీ ధ్రువపత్రాన్ని ఎలా పొందారని అన్నారు. ఆయా విశ్వవిద్యాలయాల నుంచి ఆర్‌టిఐ యాక్టు ద్వారా పొందిన ఆధారాలను ఈ సమావేశంలో బయటపెట్టారు. తమ్మినేని సీతారాం 2018లో బికాం పరీక్షకు హాజరైనట్టు చూపుతున్న ఈ నకిలీ సర్టిఫికెట్ నంబరును పరిశీలిస్తే వేరొకవ్యక్తి పేరున డిగ్రీ సర్టిఫికెట్ ఉందన్నారు. నాటి పరీక్ష కేంద్రంలో హాజరైన విద్యార్థుల జాబితాలో స్పీకర్ పేరు లేదన్నారు. ఇలాంటి వ్యక్తులు ప్రజాస్వామ్యంలో ఉన్నత పదవుల్లో కొనసాగేందుకు ఎలా అర్హులో ప్రజలే విజ్ఞతతో ఆలోచించాలన్నారు. స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవాన్ని, ఔన్నత్యాన్ని సీతారాం మంటగలిపారన్నారు. దీనిపై రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారికి ఫిర్యాదు చేశామని, వారూ స్పందించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. సమావేశంలో తెలుగు రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శింతు సుధాకర్, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, జిల్లా ఉపాధ్యక్షులు తోణంగి వెంకన్న యాదవ్, చిట్టి మోహన్, అరవల రవీంద్ర పాల్గొన్నారు.

పత్రాలను చూపిస్తున్న రవికుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి - జలుమూరు

సహకార సంఘాలు మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని అల్లాడ పిఎసిఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పనిచేసే రైతు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతుంటారని, అటువంటి రైతులను ఆదుకునే దిశగా సహకార సంఘాలను ప్రభుత్వం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని అన్నారు. సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా మన నియోజకవర్గానికి చెందిన కరిమి రాజేశ్వరరావు ఉన్నారని, చల్లవానిపేట, అల్లాడ సహకార సంఘాల ఆయన సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఫలాలను ఇచ్చే మొక్కలను నాటారని, మొక్కలు పెద్దవి ఫలాలను ఇచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. అనంతరం అల్లాడ పిఎసిఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మొజ్జాడ శ్యామలరావును, డైరెక్టర్లు నడుపూరు గోవిందరావు, అల్లు దాలెప్పన్నలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాన గోపి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, యువ నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, పిఎసిఎస్ సిఇఒ పి.గిరిధరరావు పాల్గొన్నారు.

దగ్ధమవుతున్న లారీ

లారీ దగ్ధం

ప్రజాశక్తి - పలాస

మండలంలోని కోసంగిపురం సమీపం జాతీయ రహదారిపై శనివారం రాత్రి సాంకేతిక లోపంతో టమాటా లోడ్‌తో వెళ్తున్న లారీ దగ్ధమైంది. అగ్నిమాపక, కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతం నుంచి పశ్చిమ బెంగాల్ వైపు టమాటా లోడ్‌తో లారీ వెళ్తుంది. ఒక్కసారిగా లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా క్యాబిన్ మొత్తం మంటలు అలముకున్నాయి. దీంతో డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై ఒక్కసారిగా లారీ నుంచి కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పటికే లారీ అంతా కాలిపోతుండగా, టమాటా లోడ్ పూర్తిగా పాడైంది. విషయం తెలుసుకున్న పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు రోడ్డు పొడవునా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లారీ క్యాబిన్‌లో సాంకేతికలోపం వల్లే లారీలో మంటలు వ్యాపించాయని పలాస అగ్నిమాపక ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. లారీకు సంబంధించి సుమారు రూ.20 లక్షలు, టమాటా రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఘటనాపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఇద్దరికి గాయాలు

బూర్జ : మండలంలోని అన్నంపేట సమీపంలో ఉన్న కొండపైన శనివారం తేనె సేకరిస్తుండగా... తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డాడరు. కోటబొమ్మాళి మండలానికి చెందిన వ్యక్తులు బొమ్మాళి రవ, అదే మండలం గంగపేటకు చెంఇన డి.రవి తేనె సేకరిస్తున్నారు. ఈ సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయపడ్డాడు. వెంటనే 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కింతలి మాజీ సర్పంచ్ మృతి

నర్సునాయుడు (ఫైల్)

పొందూరు: మండలంలోని కింతలి మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు, ప్రస్తుత సర్పంచ్ పైడి రాంప్రసాద్ తండ్రి పైడి నర్సునాయుడు (80) శనివారం మృతి చెందారు. ఈయన రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం స్వగృహంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఈయన 2006 నుంచి 2011 వరకూ సర్పంచ్‌గా పనిచేశారు. స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియలకు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈయన మృతికి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు సంతాపాన్ని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు : పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పొందూరు, లోలుగు ఇండస్ట్రియల్ ఫీడర్‌లకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎఇఇ ఎస్.భయ్యన్నాయుడు, ఎడి రమణమూర్తి, ఎఇ దుర్గాప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ మధుసూదనరావు

మద్యం సీసాలు పట్టివేత

సంతబొమ్మాళి :సంతబొమ్మాళి పాలేశ్వరం ఆలయం వద్ద ఎస్ఐ కె.మధుసూదనరావు తన సిబ్బందితో శనివారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. 180 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న వక్తిని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్ఐ.మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్మినా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మద్యం సీసాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గిరిజనులకు 'అప్‌హోల్డ్' సాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ తిమోతీ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట మండలం అక్కన్నగూడ, కోడిపిల్ల గూడ, గజిలి, మెట్టుగూడ, అయ్యప్పగూడ, కొండచొర్లంగి, సంతవలస, కారిగూడ, కొత్తవలస, చాకలిగుడ, రేగుమనుగుడ, కుసిమి, తలాడ, కోటం, ఉయ్యాల్లాగూడ, జోగివలస, కొండపేట, జోడుమనుగుడ, గోయిది, రుగడ, తదితర 22 గ్రామాల్లో ఉన్న పేద గిరిజనులను గుర్తించామన్నారు. నిరుపయోగంగా ఉన్న భూములను సాగు చేసి పసుపు, చీపురు, ఆరటి, నేలపనస, జీడి తదితర పంటలను పండించుకునేందుకు అప్‌హోల్డ్ సంస్థ ఆర్థిక సాయాన్ని అందిస్తుందన్నారు. మెరుగైన గిరిజన ఉత్పత్తుల ఆధారిటీ వ్యవసాయం చేసుకుని తద్వారా వారి పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు తీసుకున్చేందుకు సహకరిస్తున్నామని అన్నారు. రైతు ఉత్పత్తుల ద్వారా చిరు వ్యాపారాలను చేసుకుని ఆర్థికస్వాలంబన పెంపొందించుకుంటున్నారని అన్నారు. నూతన వంగడాలను పరిచయం చేసుకునేందుకు మేలైన సాగు వ్యవసాయ విధానాలు తెలియజేసేందుకు ఫీల్డ్ కో-ఆర్డినేటర్లను నియమించి వారికి సూచనలు, సలహాలు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 119 మంది రైతులకు ఫిబ్రవరి నుంచి రూ.20.25 లక్షలు అందజేశామని తెలిపారు.

చెక్కును అందజేస్తున్న తిమోతీ (ఫైల్)

ఆమోదాలు తప్ప అభివృద్ధి లేదు

సాధారణ కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ ధ్వజం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో ప్రతి కౌన్సెల్ సమావేశంలో అనేక అభివృద్ధి పనులకు ఆమోదం జరుగుతున్నా అభివృద్ధి లేదని అధికార పార్టీ వైసిపి వార్డు కౌన్సిలర్ సిగ్గు ప్రేమకుమార్ అవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సెల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జీరో అవర్‌లో పలువురు వార్డు కౌన్సిలన్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఒకటో వార్డ్ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఏడాది క్రితం తన వార్డులో రూ.60 వేలతో చేపట్టాల్సిన కాలువ పనులకు కౌన్సెల్ సమావేశంలో ఆమోదించారని అన్నారు. కానీ, ఆ ఫైల్ ఎక్కడ ఉందో సంభందిత సిబ్బందికి తలియకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలోనూ అనేక అంశాలను అమోదిస్తున్న వార్డులో అభివృద్ధి కనిపించడం లేదని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పురుషోత్తపురం చెరువు అభివృద్ధికి ఇంతవరకు టెండర్ స్థాయి వరకు రాలేదని అన్నారు. చెరువు పనులు ఈ వేసవిలో చేస్తే రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. 14వ ఆర్థిక సంఘానికి చెందిన నిధులు వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయని అన్నారు. 15 ఆర్థిక సంఘం నుంచైనా అభివృద్ధి చేపట్టాలని వార్డు కౌన్సిలర్ మధుమూర్తి ప్రశ్నించారు. ఈ నిధులైనా వెనక్కి వెళ్లకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని టిడిపి వార్డు కౌన్సిలర్ ఆసి లీలారాణి సూచించారు. అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని వార్డు కౌన్సిలర్ ప్రదీప్ కోరారు. భూ రీ సర్వేలో ప్రభుత్వ భూములు ఆక్రమణలను గుర్తించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎర్ర చెరువులో ఆక్రమణ తొలగించాలని, పట్టణ ప్రాంతాల్లో ఆక్రమించిన భూములు సర్వేలో రికార్డులు జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

మేడేను విజయవంతం చేయాలి

నరసన్నపేట : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసన్నపేట: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సంతోషిమాత భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆదివారంపేటలో శనివారం అన్నదానం నిర్వహించారు. ముందుగా సంతోషిమాత భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యాన యూనియన్ జండా పతాకాన్ని, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు తర్ల లక్ష్మణరావు మాట్లాడుతూ 1886లో మే నెలలో చికాగో నగరంలో ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికవర్గం పోరాటం చేసి త్యాగాలతో సాధించుకున్నారని, అదే స్ఫూర్తిని కార్మిక వర్గం ప్రస్తుతం ఫలాలుగా అనుభవిస్తున్నారని అన్నారు. ఆ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ మే 1న మేడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చలపతిరావు, లిడారి అక్కునాయుడు, తంగి వెంకటరావు, బగ్గు గురుమూర్తి, రాజాపు తవుడు, వాన అప్పారావు, ఉమా, బోర సూర్యనారాయణ, ముద్దాడ కృష్ణ, గల్లంగి, బువ్వాజి, ముద్దాడ కోటి, కరగాన కొండయ్య పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని ముత్యాలపేటలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సుగర్, బిపి తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పి.చంద్రశేఖర్, ఎంపిటిసి తడక పార్వతి, ఆరింగి శివాజీ, ఆదర్శ పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, పి.వెంకటరావు, రంగారావు, పి.అప్పలస్వామి పాల్గొన్నారు.

'కాకినాడ ఆదిత్య' విద్యార్థినుల ఔదార్యం

శ్రీకాకుళం : నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన శాంతఅనురాగ నిలయంలోని పిల్లలకు లంచ్ బాక్స్ బ్యాగ్‌లను, పిల్లలకు, వృద్ధులకు పళ్లను శనివారం పంచిపెట్టారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్విస్తుందన్నారు. అనాథ పిల్లలకు, వృద్ధులకు తమ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ మజ్జి శ్రీనివాసరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బ్యాగ్‌లను అందజేస్తున్న విద్యార్థినులు

డిగ్రీస్థాయిలో ఉపాధి అవకాశాలు

మాట్లాడుతున్న భాస్కర్

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చదువుకునే డిగ్రీ విద్యార్థులకు విద్యానంతరం ఉద్యోగావకాశాలతో పాటు ఉపాధి కల్పించే దిశ గా ప్రభుత్వం కృషి చేస్తుందని ఉన్నత విద్యా మండలి కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన ఒకటో జోన్ పరిధిలోని ప్రిన్సిపాళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ చదివిన విద్యార్థి తన భవిష్యత్‌ను తానే సరిదిద్దుకునే విధంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదిలో చేసే బోధన విద్యార్థుల్లో మార్పులు తీసుకొచ్చే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో జోన్ ఒకటో ఆర్‌జెడి శోభారాణి, నాక్ సిసిఇ కె.విజయ్‌బాబు, డి.శంకరరావు పాల్గొన్నారు.

'వృత్తివిద్య'లో మెరిసిన ఆణిముత్యాలు

సరుబుజ్జిలి: ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలి అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ (ఒకేషనల్ కోర్సు) విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు శనివారం తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 500 మార్కులకు గాను కూరాకుల మహేష్ 460 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. సవర రాజు 447 మార్కులు, సాకేటి హైమావతి 426 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని అన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సవర రీతా 1000 మార్కులకు గాను, 878 మార్కులు సాధించందని తెలిపారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు టి.అప్పలనాయుడు, రామకృష్ణలను అభినందించారు.

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

రగ్బీ పోటీలకు ఇద్దరు ఎంపిక

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గుజ్జు లక్ష్మణ్, బోకర ఢిల్లీలు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 నుంచి 2 వరకు కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న ఈ పోటీలో పాల్గొనున్నారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణలకు ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్, ఎం.బాలకృష్ణ అభినందించారు.

17న ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు

శ్రీకాకుళం అర్బన్ : ఎన్.టి.రామారావు శతజయంత్యుత్సవాలు మే 17న జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందులో భాగంగా మినీ మహానాడునూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రెండు కార్యక్రమాలపై చర్చించారు. ఈ వేడుకల్లో జిల్లాకు చెందిన పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, ఎన్‌టిసి అభిమానులు హాజరు కానున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, తోణంగి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

పర్లాకిమిడి : పర్లాకిమిడి నవోదయలో 9వ తరగతి చదివిన కాశీనగర్ బ్లాక్ వల్లాడకు సౌదామిని రైతో ఇటీవల అనుమానాస్పదస్థితిలో మృతి చెందిందని, మృతురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేసి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి దొందపాని రైతో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని కోరుతూ గజపతి జిల్లా కలెక్టరేట్ వద్ద సౌదామిని రైతో కుటుంబ సభ్యులు సుగ్యాని గోమంగో, సోపిర రైతో, సుచిత్ర గొమాంగో, జయమని రైతో, ప్రమీల సబర్‌లు ఐదు రోజులుగా రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. శనివారం దీక్షా శిబిరానికి సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.7 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కుటుంబ సభ్యులతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. మృతిపై ఇంతవరకు ప్రభుత్వం గాని, అధికారులు గాని స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు ముచ్చి బంగారు, పర్లాకిమిడి పట్టణ కమిటీ సభ్యులు వి.జెమ్స్, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) సభ్యులు శ్రీను బెహరా, గోకుల బెహరా పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు

అంధకారంలో ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - పొందూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి అంధకారంలోకి కూరుకుపోయిందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొంచాడ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్, యాగాటిపేట, లుట్టపేట, లయిదాం పంచాయతీలోని కొల్లిపేట గ్రామాలలో శనివారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడికత్తి, బాబాయి గొడ్డలిపోటు వంటి డ్రామాలతో అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు ఆవశ్యకతను ప్రజలు గుర్తించారని అన్నారు. ఇందులో భాగంగా వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ పోస్టర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, నియోజకవర్గం టిడిపి బిసి సెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు, లయిదాం సర్పంచ్ గొర్లె అనంతరామకృష్ణ, కొంచాడ మాజీ సర్పంచ్ ముగడ తవిటినాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, ప్రధాన కార్యదర్శి వండాన మురళి పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

వజ్రపుకొత్తూరు : వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. మండలంలోని కంబాలరాయుడుపేటలో శనివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. రహదారులు అధ్వానంగా తయారవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సురాడ మోహనరావు, గోవింద పాపారావు, దనేసు కోణారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రచారంలో పాల్గొన్న గౌతు శిరీష

సమీక్షిస్తున్న మంత్రి సురేష్, స్పీకర్ సీతారాం

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో శనివారం సమీక్షించారు. ముందుగా స్పీకర్ సురేష్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. టిట్కో ఇళ్ల మంజూరు ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వంశధార - నాగావళి నదుల నుంచి తాగునీటిని పట్టణ ప్రజలకు అందించేందుకు రూ.67 కోట్ల అంచనాలతో చేపట్టిన భారీ రక్షిత నీటి పథకం పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వార్డు సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మామిడి రమేష్, పొదిలాపు తిరుపతి, సంపదరావు రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మున్సిపల్ కమిషనర్ సీతారాంకు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులతో నీటి ఎద్దడి నివారణపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి, అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని చెప్పారు. ప్రతి వార్డుకూ ట్యాంకర్ల ద్వారా రోజూ నీటిని సరఫరా చేయాలన్నారు. వార్డులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు పరామర్శ

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నర్సిపురానికి చెందిన కౌన్సిలర్ పిచ్చుక అజయ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయాన్ని తెలుసుకొని చైర్మన్ బల్ల గిరిబాబు అజయ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు మున్సిపల్ కో-ఆప్షన్ మెంబరు బమ్మిడి సంతోష్‌కుమార్, బల్ల శ్రీను, రవి, ధనుంజయ్, మధు ఉన్నారు.

మైనారిటీలను మోసం చేస్తున్న చంద్రబాబు

కోటబొమ్మాళి: చంద్రబాబు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తన స్వార్థం కోసం ముస్లిం మైనార్టీల ప్రయోజనాలను ఫణంగా పెట్టడానికి ఎప్పుడూ వెనకాడరని, మతతత్వ బిజెపితో చెలిమి చేసేందుకు అర్రులు చాచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని మండల కో-అప్షన్ మెంబర్ ఎస్.కె.రంజాన్‌రాజు బాయ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను అధికారంలో ఉండగా మైనార్టీల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోని చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన సెక్యులర్ ముసుగును తొలగించి అసలు సిసలైన మతతత్వ నైజాన్ని బహిర్గతం చేసుకున్నారని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్‌తో చెలిమి చేసి బిజెపిపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీపై సైతం వ్యక్తిగత విమర్శలు చేశారని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతతత్వ బిజెపికి ఇలా సాగిలాపడడం సిగ్గుచేటని అన్నారు.

వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలి

లావేరు: వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. మురపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక రవితేజ కాన్వెంట్, అలాగే లావేరు ప్రాథమిక పాఠశాల హైస్కూల్, స్థానిక లిటిల్ స్కూల్, సత్యసాయి స్కూల్ ఉపాధ్యాయులను శనివారం కలిశారు. ఈ మేరకు శిక్షణా శిబిరాలు గురించి తెలియజేశారు. మే 8 నుంచి జూన్ 16 వరకు వేసవి శిక్షణ శిబిరాలు స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలరాజు, ప్రధానోపాధ్యాయులు అరుణ, వసంత లక్ష్మి, వేణుగోపాలరావు, గ్రంథాలయ సహాయకులు, షణ్ముఖరావు, గడ్డియ్య పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

టెక్కలి : రానున్న ఎన్నికల్లో ఓటర్లను టిడిపి వైపు మళ్లించేందుకు అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని ప్రతి కార్యకర్తా భూత్ కన్వీనర్లు అందిపుచ్చుకోవాలని జిల్లా పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ ఊన సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా ఇన్‌ఛార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సోషల్ మీడియాను వినియోగించుకోవాలన్నారు.టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు లొడగల కృష్ణారావు, జిల్లా టెలిగ్రామ్ బాట్ శిక్షకులు మోహన్ కృష్ణ, మండలాల సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

స్పీకర్‌ను కోరిన బి.ఆర్ నగర ప్రజలు

పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్న మహిళలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బొడ్డేపల్లి రాజగోపాలరావు నగర్‌లోని రహదారులు, డ్రెయినేజీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. పురపాలక సంఘంలోని ఎనిమిదో వార్డు పరిధి బి.ఆర్.నగర్‌లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు తమకు రోడ్డు, డ్రెయినేజీలు, తాగునీటి కుళాయిలు వంటి మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈ లేఅవుట్ చుక్కల భూమి అని, ఎలా కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని వారిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిష్కారం చూపెడుతున్నారని, అనుమతులు మంజూరు అవుతాయని తెలిపారు. వచ్చే నెలలో ఒక ఆదివారం అధికారులను వెంటబెట్టుకొని బి.ఆర్.నగర్‌కు హామీనిచ్చారు. అమరావతి పార్కును అభివృద్ధి చేయాలని మహిళలు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సచివాలయ పట్టణ కన్వీనర్ వారు ఇన్‌ఛార్జి అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, మామిడి రమేష్, బొడ్డేపల్లి వెంకటరమణమూర్తి, పేడాడ వెంకటరమణ, సంపతరావు కృష్ణారావు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని బేశి రామచంద్రపురం పంచాయతీలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిపిలు ఎన్.దాసు, పైల దేవదాస్ రెడ్డి, నాయకులు బి.శ్రీకృష్ణ, హైమావతి, రమేష్, గున్నయ్య, మోహన్, ఢిల్లీరావు, బెందలం వెంకటరమణ పాల్గొన్నారు.

సోంపేట : ప్రచారం చేస్తున్న విజయ

కోట్లాది జనం గుండెల్లో జగన్

ప్రజాశక్తి- నరసన్నపేట

నాలుగేళ్ల సంక్షేమ సుపరిపాలనతో కోట్లాది జనం గుండెల్లో సిఎంగా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చెరగని ముద్రవేశారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని వైసిపి కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 7న జగనన్నే మా భవిష్యత్' పేరుతో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిందని, ఏడు లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటినీ సందర్శించారని అన్నారు. క్షేత్రస్థాయిలో వైసిపి నాయకులు పట్టుదలతో పని చేసి ఈ సర్వేని పారదర్శకంగా నిర్వహించారన్నారు.

రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం : మెగా పీపుల్ సర్వే విజయవంతమైందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం అవినీతి రహిత మధ్యవర్తులు లేని సంక్షేమ, అభివృద్ధి ప్రభుత్వమని అన్నారు. అనంతరం నాలుగు మండలాల జెసిఎం ఇన్‌ఛార్జిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, లావేరు, జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, లావేరు జడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షులు జరుగుళ్ల శంకరరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మెగా పీపుల్స్ సర్వే విజయవంతమైందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా వారి అభిప్రాయాలు వ్యక్తం చేసిన గొప్ప కార్యక్రమం ఈ మెగా పీపుల్స్ సర్వే అని అన్నారు. ఈ సర్వే ఫలితాలు చూసి విపక్షాలకు షాక్ కొట్టినట్టయిందన్నారు. ంపిపి అట్లా సరోజనమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు బాడన మురళి, బమ్మిడి తులసీరావు ఉన్నారు.

సన్మానిస్తున్న నాయుడు

మాదకద్రవ్యాలకు బానిస కావద్దు

శ్రీకాకుళం: మాదకద్రవ్యాలకు బానిస కావద్దని క్రైమ్ అదనపు ఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు సూచించారు. శ్రీకాకుళం రూరల్ మండలం గురజాడ విద్యాసంస్థల అనుబంధ కళాశాల గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ విభాగ ఆధ్వర్యాన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల 700 విద్యార్థులతో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్నోకార్ట్- 2023 అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు నేర ప్రవృత్తి వైపు దష్టి మళ్లించకుండా ఉన్నత విద్యను అభ్యసించి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుకున్న వయసులో యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా క్రమశిక్షణతో నడుచుకుంటూ మంచి ఆశయాలతో భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. మనల్ని ప్రభావితం చేసే పరిసరాల ప్రభావాలను మనకు మనమే నియంత్రించుకోవాలన్నారు. మత్తుపదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. అనంతరం డ్రగ్స్, చైల్డ్ పోర్న్ గ్రఫీ, సైబర్ నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి పలు అంశాలపై సూచనలు సలహాలు చేశారు. కళాశాల అధినేత జిఎస్ఎల్ నాయుడు మాట్లాడుతూ మీరంతా రేపటి తరం శాస్త్రవేత్తలుగా కనిపిస్తున్నారన్నారు. అనంతరం విఠలేశ్వరరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, కంప్యూటర్ విభాగాధిపతి బాలసుందర్, రాజకుమార్, ప్రదీప్, సునీత, మార్తాండ కృష్ణ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎస్ఐ కేశ్వరరావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అంగన్వాడీ కార్యకర్త నియామకం

టెక్కలి: టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయ పరిధి టెక్కలి పట్టణ చెరువు గట్టు అంగన్వాడీ కేంద్రం కార్యకర్త నియామకం ఎట్టకేలకు జరిగింది. ఈ మేరకు చెరువు గట్టు కేంద్రం ఆంగన్వాడీ కేంద్ర కార్యకర్తగా కొండవీటి ఝాన్సీరాణిని నియమిస్తూ... పిఒ శోభారాణి శనివారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఈ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వర్తించిన దేవాది శాంతామణి పదేళ్ల క్రితం నిర్వహించిన ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల్లో పోటీ సందర్భంగా కార్యకర్త విధులకు రాజీనామా చేశారు. ఫలితాల్లో ఓటమి పాలవ్వడంతో తన కార్యకర్త పోస్టు తనకే కేటాయించాలని అధికారులను కోరారు. రాజీనామా చేసిన తర్వాత నిబంధనలకు వ్యతిరేకంగా పోస్టు ఇవ్వడం కుదరదని ఐసిడిఎస్ అధికారులు చెప్పారు. దీంతో శాంతామణి న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు నడుస్తుండగా... రెండేళ్ల క్రితం నిర్వహించిన స్థానిక సంస్థాగత ఎన్నికల్లో మళ్లీ ఎంపిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో కార్యకర్త నియామకానికి సంబంధించి అడ్డంకులు తొలగిపోయాయి. అయినా ఈ కేంద్రానికి కార్యకర్త నియామకం చేపట్టలేదు. అర్హులైన వారు లేకపోవడం, రిజర్వేషన్‌లో రోస్టర్ విధానం అమలు కాకపోవడం, ఇటువంటి సాంకేతిక లోపాలు వల్ల కార్యకర్త నియామకం చేపట్టలేదు. ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయడంతో కొండవీటి ఝాన్సీరాణి ఎంపికైంది. దీంతో ఆమెకు ఐసిడిఎస్ అధికారులు నియామక పత్రాన్ని అందజేశారు.

సన్మానిస్తున్న సిబ్బంది

మధుసాహు సేవలు భేష్

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆరెండ్డీ డైరెక్టర్ డాక్టర్ కె.బి.మధుసాహు వివిధ హోదాల్లో అందించిన సేవలు భేష్ అని కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు అన్నారు. ప్రొఫెసర్ మధుసా హు ఉద్యోగ విరమణ ఉత్సవంలో భాగంగా ముఖ్య అతిదిగా పాల్గొని డాక్టర్ సాహు సేవలను కొనియాడా రు. ఫ్యాకల్టీగా, ఇఇఇ హెచ్‌డిగా, ప్రిన్సిపాల్‌గా, ఆరెండ్డీ డైరెక్టరుగా ఐతమ్ విశేష సేవలం దించారని అన్నారు. కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజులు మాట్లాడుతూ ఐతమ్ అభివృద్ధిలో భోధన, భోదనేతర సిబ్బంది కృషిని యాజమాన్యం ఎన్నటికీ మరువదన్నారు. 22 ఏళ్ళ తన ఐతమ్ ప్రయాణంలో యాజమా న్యం సహకారం ఎంతో ఉందని డాక్టర్ మధుసాహు చెప్పారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది టి.వి.ఎస్. మురళీకృష్ణ, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గౌతు శిరీష పరామర్శ

పలాస: మండలంలోని బొడ్డపాడుకు చెందిన టిడిపి నాయకులు, అన్నదాత రైతు సంఘం మాజీ అధ్యక్షులు బొడ్డు రామన్న ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

పొందూరు నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

టెక్కలి జవహర్ నవోదయ వెన్నెలవలస పాఠశాల్లో ఆరో తరగతిలో ప్రవేశ నిమిత్తం శనివారం టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 240 మందికి గాను, 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లుగా వై.హరిబాబు, శోభారాణి వ్యవహరించారు.

రణస్థలం : మండలంలోని ఎపి మోడల్ స్కూల్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఇఒ ఎ.త్రినాథరావు తెలిపారు. మోడల్ స్కూల్ 275 మంది, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 227 మంది విద్యార్థులు పరీక్షలు శారని అన్నారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఎ కేంద్రంలో 240 మంది విద్యార్థులకు గాను, 216 మంది, బి కేంద్రంలో 151 మంది విద్యార్థులకు గాను, 142 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షకు చీఫ్ సూపరిండెంట్లుగా కాసులబాబు, సంజీవరావులు వ్యవహరించారు. వెన్నెలవలస నవోదయ కస్టోడియన్ అండ్ లైజనింగ్ అధికారి వంశీధర్, ఎంఇఒ పి.వి.రామరాజులు పర్యవేక్షించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గడంతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. అధికారులు సూచించిన కషాయాలు, బీజామృతం స్వయంగా తయారు చేసుకొని లబ్ధిపొందాలని కోరారు. గ్రామంలో రైతులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యాంకర్ కుమారి, వ్యవసాయ శాఖ సిబ్బంది కృష్ణవేణి, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న రాజగోపాలరావు

వ్యవసాయ పరికరాల పంపిణీ

బూర్జ : మండలంలో అన్నంపేట రైతు భరోసా కేంద్రం టి.డి.ఆర్.పేటకు చెందిన చీడిపోలమ్మతల్లి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌కు వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలను వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాల్‌రావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.15 లక్షలు విలువైన ట్రాక్టర్, రోటోవేటర్, వరి కోత యంత్రాలు, వరి నూర్పుడిస యంత్ర పరికిరాలను వ్యవసాయశాఖ, పాలకొండ డిసిసిబి బ్యాంకు సంయుక్తంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వి రాజేశ్వరరావు, బాబ్జీ, సూపర్‌వైజర్ జనార్ధననాయుడు, సిహెచ్‌సి గ్రూప్ సభ్యులు ఇప్పిలి రాజు, ఇప్పిలి సిమ్మన పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న అన్వేష్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో క్రైస్తవులకు సరైన సమధుల దొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, దీని కోసం నిధులు మంజూరు చేయాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ కోరారు. ఈ మేరకు విశాఖపట్నం వచ్చిన టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బి.జాన్‌వెస్లీలను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 62 చర్చిలు ఉన్నాయని, సరైన శ్మశాన వాటికలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి శ్మశాన వాటికకు వెళ్లాల్సి దుస్థితి నెలకుందని అన్నారు. అక్కడకి వెళ్లడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని అన్నారు. ప్రహరి లేకపోవడంతో శవ పేటిక పట్టుకొని వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

మందస : మండలంలోని రామరాయికు చెందిన సవర రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జగన్నాయుకులు, జెఎసి జిల్లా అధ్యక్షులు ఎస్.రాంబాబు, ఎస్.మోహనరావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు ఎస్.రామారావు, రాష్ట్ర ఎగ్జిక్యూట్ మెంబరు వి.వరాలమ్మ, పి.ఈశ్వరరావు, ఎఐఎఇఎఫ్ అధ్యక్షులు శనివారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ వంతుగా రూ.ఆరు వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.చంద్రశేఖర్, ఎస్.చిన్నబాబు, జె.రమణారావు, ఎస్.నీలకంఠం, ఎస్.లింగరాజు, ఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామదేవతకు 8 అడుగుల అగరబత్తి

ఇచ్ఛాపురం : గ్రామదేవత శ్రీ సేచ్ఛావతి అమ్మవారు ఉత్సవాల సందర్భంగా ఏలూరుకు చెందిన అంబికా అగర బత్తి కంపెనీ రూ.6 వేలు విలువైన 8 అడుగుల భారీ అగరబత్తిని వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సమక్షంలో భారీ అగరబత్తిని ఉప్పలవీధి ఉత్సవ మండలం వద్ద శనివారం వెలిగించారు. దాదాపు 30 గంటల వరకూ వెలుగుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగరబత్తిని వెలిగించిన కమిటీ సభ్యులు